# కార్మికుల సహకారం

( గల్పిక )

యుద్ధం జోరుగా సాగుతోంది.

హిట్లరుకు జెన్నిచ్చి పారిపోయివచ్చిన తెల్లవాళ్లు ఇండియాలో ఫాక్టరీలు పెట్టి యుద్ధ సహాయం ఆరంభించారు. సోడాలోనూ హాంబర్గలోనూ కూలీలుగా పనిచేసి చేతులూ మొహాలూ మసిచేసుకొన్న దొరలు మార్వాడీలదగ్గిరా, గుజరాతీవాళ్ల దగ్గిరా పెట్టుబడులు సంపాదించి ఫాక్టరీలు నడిపి, తాము ఎన్నడూ కనీవినని యుద్ధపరికరాలు — అతిచిన్నవి — తయారుచేసి లక్షలు గడించి, ఖరీదైన కార్లలో తిరగసాగారు.

అటువంటిఫాక్టరీకి ఒకనాడు ఒక దొరగారు — అసలైన సీమదొర — ఇండియా ప్రభుత్వంతరఫున తణిఖీకి వచ్చాడు.

డైకాస్టింగుయంత్రాలు పనిచేస్తున్నాయి. దొరగారు పనిచేసేవారి కేసి చూశాడు. వాళ్ల మొహాలమీద కారే చెమట ఆయనకు చాలా తృప్తి కలిగించింది. వాళ్ల చురుకుదనం కూడా ఆయనకు తృప్తికరంగా ఉంది. (దొరగారున్నంతసేపూ జోరుగా పనిచెయ్యమని సూపర్‌వైజరు వాళ్లతో చెప్పి ఉన్నాడు.)

సీమదొరవెంట ఫాక్టరీ దొరలుకూడా ఉన్నారు.

"వాళ్లు ఏం చేస్తున్నారు వాళ్లకు తెలుసునా?" అన్నాడు ఇంగ్లీషుదొర ఇంగ్లీషు రానిదొరలతో.

వాళ్లు మూడునాలుగుసార్లు నోళ్లు తెరిచి మూసి ఆఖరుకు సూపర్‌వైజరును పిలిచి అదేప్రశ్న వేశారు.

"వాళ్లేపాపం ఎరగరు," అన్నాడు సూ.

"వాళ్లకు తెలియాలి. ఈ యుద్ధంలో వాళ్లు హిట్లరుకు విరుద్ధంగా మారణాస్త్రభాగాలు తయారుచేస్తున్నారు. అవి ఎట్లా ఉపయోగపడేదీ వాళ్లకు తెలియాలి. అప్పుడుగాని వాళ్లు ఉత్సాహంతో పనిచెయ్యరు. నువు చదువుకున్నవాడివి. వాళ్లకు చెప్పాలి," అన్నాడు సీమదొర.

"చెబుతును గాని, నాకే తెలీదు," అన్నాడు సూపర్‌వైజరు.

"చూడు," అన్నాడు సీమదొర జాలిగా, "నువు చేస్తున్న ఈ భాగాన్ని ఫ్యూజ్ కాప్ అంటారు. దీన్ని చేతిబాంబుల్లో వాడతారు. చేతిబాంబు ఇది లేకపోతే పేలదు. చేతిబాంబుకు ఒక స్ప్రింగ్ ఉంటుంది. మామూలుగా దాన్ని రింగు ఒకటి అదిమి పట్టిఉంటుంది. ఆ రింగు తీసి, స్ప్రింగును చేత్తో నొక్కిపట్టి బాంబును శత్రువుమీద విసురుతావు. ఆ విసరడంలో స్ప్రింగు పైకి తన్నుతుంది. తన్నినతరవాత సరిగా ఏడు సెకండ్లకు బాంబు పేలుతుంది. అది పేలినప్పుడు — ఈవిధంగా ఆయన చెప్పుకుపోయినాడు.

## శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

"ఈవిషయాలన్నీ పనివాళ్లకు చెప్పు" అన్నారు, హిట్లరునోట గడ్డి కొట్టివచ్చిన దొరలు.

దొరలంతా వెళ్లిపోయినారు.

"ఏయ్, అందరు ఇట్లా రండి... ఇది చూశారా. దీనిపేరు ఫ్యూజ్ కాప్. అంటే ఏమిటో మీకు తెలీదు. దీన్ని తయారుచెయ్యటానికి ఫాక్టరీ అర్ధణా ఖర్చుచేస్తుంది. గవర్నమెంటువారు దీన్ని మనదగ్గర ఏడణాలకు కొంటారు. ఇందువల్లనే మనఫాక్టరీ యాభై వేలరూపాయల పెట్టుబడితో అయిదు లక్షుల యంత్రాలు కొన్నది. దీన్ని ఇవాళ ఆరులక్షులకు దొరలు అమ్మజూపుతున్నారు. అది మనకు అప్రస్తుతం.

"ఈ మారణయంత్రాలు ముఖ్యంగా బర్మారంగానికి పంపుతారు. అక్కడ దొరలు వీటికి చాలా రోజులు కాపలాకాసి వెళ్లేటప్పుడు కోతబడునని వదిలేసి పోతారు. వాటిని జపానువాళ్లు స్వాధీనపరచుకుని ఇండియాకు తెచ్చి మనమీద వేస్తారు. అది వేరే కథ.

"ముఖ్యమైనవిషయమేమంటే ఈ పని మీరెంత చురుకుగా చేస్తే మారణాయుధాలు అంతచురుకుగా తయారై యుద్ధం అంత త్వరగా అయిపోతుంది. యుద్ధం త్వరగా అయిపోయిందంటే, పన్నెండణాల రోజుకూలిమీద తిండికి కూడా సరిగా జరగని మీరు ఈ చెరనుండి విముక్తి పొంది, గ్రామాలకు పోయి వీలయితే హాయిగా గొర్రెల్ని కాసుకోవచ్చు," అన్నాడు సూపర్‌వైజరు.

"హావా!" "శాబాష్!" అన్నారు కార్మికులు.

అప్పుడే డైకాస్టింగుఖాతాలోకి తొంగిచూచిన ఫాక్టరీదొర ఒకడు, సూపర్‌వైజరు కార్మికులను ఉత్సాహపరుస్తూ ఉండటం చూసి సహించలేక, "ఏమిటే మీటింగు? పోయి పని చూడండి! క్విక్, క్విక్!" అని అదిలించాడు.

---

కాశ్మీర్
అన్నిదగ్గులకు అమోఘమైనది
గిరిజా & కో; రాజమండ్రి